

# ఐదుగురు అర్చకులకు టైమ్ స్కేల్ మంజూరు

## ఉత్తర్వులు జారీ చేసిన ఆలయ ఈవో రమాదేవి

**ప్రజానావ, వేములవాడ:** రాజరాజేశ్వర ఆలయంలో పనిచేస్తున్న ఉప ప్రధాన అర్చకులకు ఆలయ పరిపాలన కమిటీ శుభవార్త తెలిపింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో ఉప ప్రధాన అర్చకులుగా సేవలందిస్తున్న ఐదుగురు ఉద్యోగులకు అసిస్టెంట్ కమిషనర్ టైమ్ స్కేల్ మంజూరు చేస్తూ ఆలయ ఈవో రమాదేవి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయంతో ఆలయంలో సేవలందిస్తున్న అర్చకులకు ప్రోత్సాహం లభించిందని అధికారులు తెలిపారు. టైమ్ స్కేల్ పొందిన వారిలో ఉప ప్రధాన అర్చకులు పారువెల్లి భాను, కేశన్నగారి శ్రీకాంత్, చంద్రగిరి శరత్, నమిలికొండ రాజేశ్వర శర్మ, కటుకూరి వెంకటయ్య (తమ్మల) ఉన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఈశ్వర్ గారి సురేశ్ సహా ఇతర ఆలయ అధికారులు పాల్గొన్నారు. అధికారుల నిర్ణయంతో అర్చకులు హర్షం వ్యక్తం చేస్తూ దేవస్థాన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# భీమేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయం 2.16 కోట్లు

## 35 రోజుల్లో భక్తుల నుంచి భారీ కానుకలు

## 161 గ్రాముల బంగారం, 10.9 కిలోల వెండి సమర్పణ



**ప్రజానావ, వేములవాడ:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని భీమేశ్వర స్వామి ఆలయంలో గత 35 రోజుల కాలంలో భక్తులు సమర్పించిన హుండీ ఆదాయం వివరాలను ఆలయ అధికారులు వెల్లడించారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా మొత్తం రూ.2,16,65,140 నగదు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా మిశ్రమ బంగారం 161 గ్రాములు, మిశ్రమ వెండి 10 కిలోల 900 గ్రాములు సమర్పించబడినట్లు వెల్లడించారు. ఈ హుండీ లెక్కింపును ఆలయ ఈవో రమాదేవి, కరీంనగర్ ఏసీ కార్యాలయానికి చెందిన రాజమౌళి పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యనిర్వహణాధికారులు, ఇతర అధికారులు, పర్యవేక్షకులు, ఆలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది, రాజరాజేశ్వర సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



# బస్తీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయాలి

## ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



**ప్రజానావ, ఖైరతాబాద్:** ఫిలింనగర్‌లోని స్వామి వివేకానంద నగర్ బస్తీ ఎన్నికల్లో నూతన బస్తీ అధ్యక్షుడిగా ఘన విజయం సాధించిన వంక్రసంబరం హనుమంతు ముదిరాజ్ ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా చింతల మాట్లాడుతూ బస్తీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, బస్తీలో ఉన్న పెండింగ్ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా బస్తీ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు ముద్దంగుల శ్రీనివాస్, బీజేపీ సీనియర్ నాయకులు బోయ రామాంజనేయులు, డివిజన్ ప్రధాన కార్యదర్శి గుంటి ఆనంద్ సాగర్, ఇతర బీజేపీ ముఖ్య నాయకులతో పాటు బస్తీ నాయకులు గొల్లి రమ్య, సుజాత, నగేశ్, నరేశ్, ఇతర బస్తీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# వేములవాడ పెద్దాసుపత్రిలో వైద్యం కరువు!

- గైనకాలజిస్ట్ లేక గర్భిణి ప్రసవ వేదన
- అడ్మిట్ చేసుకోలేని సిబ్బంది
- 45 రోజులుగా గైనకాలజిస్ట్ కొరత
- పరిస్థితి తెలిసినా పట్టించుకోని జిల్లా యంత్రాంగం






**ప్రజానావ, వేములవాడ:** పేరుకే పెద్ద దవాఖానా.. కానీ ఆస్పత్రిలో సమయానికి వైద్యం అందే పరిస్థితి లేదు. ప్రసవ వేదనతో దూర ప్రాంతం నుంచి వచ్చిన రోగులకు సమయానికి వైద్యం అందించే నాథుడే కరువయ్యారు. వేములవాడ నియోజకవర్గానికి పెద్ద దిక్కుగా ఉన్న ఏరియా ఆసుపత్రిలో గర్భిణికి వైద్యం అందక సిరిసిల్లకు వెళ్లిన పరిస్థితిపై అధికారులు, ప్రజాప్రతినిధులు సిగ్గుతో తలదించుకునే పరిస్థితి నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. రుద్రంగి మండలానికి చెందిన ఓ గర్భిణి ప్రసవ వేదనతో బాధపడుతుండడంతో కుటుంబసభ్యులు 108 అంబులెన్స్ ద్వారా వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే ఇక్కడ గత 45 రోజులుగా గైనకాలజిస్ట్ అందుబాటులో లేరన్న నెపంతో అడ్మిట్ చేసుకునేందుకు సిబ్బంది నిరాకరించారు. గైనకాలజిస్ట్ లేకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది ఏం చేయలేక చేతులెత్తేశారు. కుటుంబసభ్యులు వెంటనే సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు గర్భిణికి వైద్య సేవలందించారు. ఇంతవరకు బాగానే ఉన్నా వేములవాడ ఏరియా ఆసుపత్రిలో వైద్యసేవల నిర్లక్ష్యం, జిల్లా అధికారుల చిత్తశుద్ధిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 45 రోజులుగా గైనకాలజిస్ట్ లేరని సిబ్బంది చెబుతుండగా.. ఉన్న ఒక్క గైనకాలజిస్ట్ సెలవులో వెళ్లారంటూ ఆ అస్పత్రి సూపరింటెండెంట్ రవిందర్ సమాధానమిచ్చారు.

### నిర్లక్ష్యమెవరిదీ?

వేములవాడ ఏరియా ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ కొరత జిల్లా పాలన అధికారులకు.. ప్రజా ప్రతినిధులకు తెలిసిన విషయమే. వైద్యసేవలకు సంబంధించిన విషయంలో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్య ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. ప్రజాపాలన కార్యక్రమాలు జరుగుతున్న వేళ ఇలాంటి సంఘటనలు జరగడంపై ప్రజల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలొస్తున్నాయి.

# ముంబై విధాన్ సభ, మెట్రో, స్టాక్ మార్కెట్‌ను పేల్చివేస్తాం

- సీపీఏ అధికారిక మెయిల్‌కు గుర్తుతెలియని వ్యక్తుల ఈ-మెయిల్
- అప్రమత్తమైన పోలీస్ వ్యవస్థ అప్రమత్తం




**ప్రజానావ, ముంబై:** ముంబైలో మహారాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా ,మహారాష్ట్ర విధాన సభను పేల్చివేస్తామని గుర్తుతెలియని వ్యక్తి నుంచి వచ్చిన ఈ-మెయిల్ కలకలం సృష్టించింది. ఈ మెయిల్ అందిన వెంటనే, పోలీసులు వెంటనే చర్య తీసుకుని మొత్తం ప్రాంతంలో సోదాలు ప్రారంభించారు. భద్రతా కారణాల దృష్ట్యా, మొదట్లో విధాన సభ ఉద్యోగులను ప్రవేశ ద్వారం వద్దనే ఆపారు. తర్వాత, గుర్తింపు కార్డు తనిఖీ, భద్రతా ధృవీకరణ తర్వాత, ఉద్యోగులను దశలవారీగా లోపలికి అనుమతించారు. ఈ సంఘటన గురించి శాసన మండలి చైర్మన్ రామ్ షిండే సమాచారం ఇచ్చారు. ఉదయం 6:57 గంటల ప్రాంతంలో సీపీఏ అధికారిక మెయిల్‌కు బెదిరింపు సందేశం వచ్చిందని ఆయన అన్నారు. బడ్జెట్ సెషన్ సందర్భంగా బాంబులు, క్షిపణులను ఉపయోగించి దాడి జరుగుతుందని ఆ మెయిల్‌లో హెచ్చరిక ఇవ్వబడింది. ఈ సమాచారం అందిన వెంటనే, పోలీసులు, భద్రతా సంస్థలు వెంటనే రంగంలోకి దిగాయి. బాంబు గుర్తింపు, నిర్వీర్య బృందం వెంటనే దర్యాప్తు ప్రారంభించి మొత్తం ప్రాంతాన్ని తనిఖీ చేసింది. ఇందులో విధాన భవన్ గురించి మాత్రమే కాకుండా ముంబైలోని మరో నాలుగు ముఖ్యమైన ప్రదేశాలను లక్ష్యంగా చేసుకుంటామని కూడా హెచ్చరించారు. వీటిలో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్, ముంబై హైకోర్టు, ముంబై మెట్రో మరియు ఒక బ్యాంకు ఉన్నాయి. ఈ ప్రదేశాలన్నింటినీ క్షిపణులు, బాంబులతో పేల్చివేస్తామని బెదిరింపు మెయిల్‌లో ప్రస్తావించబడింది. దీని కారణంగా, నగరంలోని భద్రతా సంస్థలు తక్షణ జాగ్రత్తలు తీసుకుని, వివిధ సున్నితమైన ప్రాంతాలలో అప్రమత్తతను పెంచాయి. ఈ విషయంపై సమగ్ర దర్యాప్తు జరుగుతోందని రామ్ షిండే అన్నారు. భద్రతా కారణాల దృష్ట్యా, అన్ని సమాచారాన్ని వెంటనే బహిర్గతం చేయడం సముచితం కాదు. అయితే, సంబంధిత సంస్థలు అప్రమత్తంగా ఉన్నాయి. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బెదిరింపు మెయిల్ ఖలిస్తానీ ఉద్యమానికి సంబంధించినది కావచ్చని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈ నేపథ్యంలో, హోం శాఖ అన్ని భద్రతా సంస్థలను అప్రమత్తంగా ఉండాలని ఆదేశించింది.

### పోలీసుల సమగ్ర దర్యాప్తు

ఈ సంఘటన తర్వాత ముంబైలోని ముఖ్యమైన ప్రదేశాలలో పోలీస్ భద్రతను పెంచారు. బాంబు గుర్తింపు బృందాలు, స్థానిక పోలీసులు, ప్రత్యేక భద్రతా బృందాలు వివిధ ప్రదేశాలలో తనిఖీ డ్రైవ్‌లను ప్రారంభించాయి. బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నందున, చాలా మంది మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు విధాన భవన్ ప్రాంతంలో ఉన్నారు. అందువల్ల, ఎటువంటి ముప్పు రాకుండా ఉండటానికి ప్రభుత్వం అదనపు జాగ్రత్తలు తీసుకుంది. బెదిరింపు ఈ-మెయిల్ ఎక్కడి నుండి పంపబడిందో, దాని వెనుక ఎవరున్నారో తెలుసుకోవడానికి పోలీసులు సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు.

# పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు

**ప్రజానావ, తిర్యాణి:** మండలంలోని ఖైరిగూడ గ్రామంలో పశువులకు శుక్రవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆవులు, గేదెలకు కలిపి మొత్తం 272 పశువులకు టీకాలు వేశారు. అనంతరం మండల పశు వైద్యాధికారి ఎస్.సాగర్ మాట్లాడుతూ పశువుల్లో ఎలాంటి అనారోగ్య లక్షణాలు కనిపించినా వెంటనే సమీప పశువైద్యశాలను సంప్రదించాలని సూచించారు. పశువుల ఆరోగ్యం రైతుల ఆర్థికాభివృద్ధికి ఎంతో కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖైరిగూడ గ్రామ పంచాయతీ సర్పంచ్ హెరేకుమ్ర రేణుక, ఉప సర్పంచ్ సెడ్మాకి మోహన్, మండల పశు, సిబ్బంది సురేష్, మనోహర్, రాకేష్, సంతోష్. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



**జూబ్లీహిల్స్ డివిజన్ ఫిల్మ్ నగర్ - వినాయకనగర్ వాసులు గునగంటి నాగమణి - చక్రవర్తిల కుమారుడు నరేశ్, శ్వేతల వివాహం సందర్భంగా నూతన వధూవరులను ఖైరతాబాద్ నాయకులు, జూబ్లీహిల్స్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు హాజరై ఆశీర్వదించారు.**

- ప్రజానావ, ఖైరతాబాద్



